క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

సీతానగరం: మండలంలోని పురుషోత్తపట్నం సబ్ స్టేషన్ మరమ్మతుల కోసం పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం రూరల్ ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ గురువారం తెలిపారు. పురుషోత్తపట్నం ఫీడర్ పరిధిలోని పురుషోత్తపట్నం, రామచంద్రపురం గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

సారాతో వ్యక్తి అరెస్టు


ఈలకొలనులో నిందితుడితో ఎక్సైజ్ సిబ్బంది

రంగంపేట: ఈలకొలను గ్రామంలో దాడులు నిర్వహించి పది లీటర్ల సారాతో వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ సీఐ సుధ గురువారం తెలిపారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఈ దాడులు నిర్వహించామన్నారు. గ్రామంలో సారా తయారీ, విక్రయాలు జరుపుతున్న కాలా ఏసుప్రసాద్‌ను అరెస్టు చేసినట్టు చెప్పారు. అతని వద్ద నుంచి 10 లీటర్ల సారా, 400 లీటర్ల బెల్లపు ఊటను స్వాధీనం చేసుకున్నామన్నారు. బెల్లపు ఊటను ధ్వంసం చేసి, నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు.

షిరిడీ సాయికి ప్రత్యేక పూజలు


రంగంపేటలో దత్త సాయిబాబా

రంగంపేట: పెద రాయవరం గ్రామంలో ఉన్న షిరిడీ సాయిబాబా మందిరంలో గురువారం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మండల కేంద్రమైన రంగంపేట గ్రామంలోని దత్తసాయి మందిరంలో బాబాకు ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకున్నారు.

ప్రసన్న ఆంజనేయ స్వామికి పూజలు


ఊలపల్లిలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తున్న డాక్టర్ సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు

బిక్కవోలు: ఊలపల్లి గ్రామంలో ప్రసన్న ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ గురువారం జరిగింది. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు కార్యక్రమంలో పాల్గొని, స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి, గుండ్రాల విజయశేఖర్, దుంగల శ్రీను, మూనూరు శంకర్, మామిడాల నాగబాబు పాల్గొన్నారు.

విశిష్ట సంఖ్యను సమర్థంగా నమోదు చేయాలి

– ఏఓ మణిదీప్

పెదపూడి: రైతుల విశిష్ట సంఖ్య(యూసీ) నమోదు ప్రక్రియను అధికారులు సమర్థవంతంగా నిర్వహించాలని మండల వ్యవసాయాధికారి టీవీఆర్ మణిదీప్ అన్నారు. సంపర గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయకులు రైతులకు చేస్తున్న విశిష్ట సంఖ్య నమోదు ప్రక్రియను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రైతు రిజిస్ట్రీ పోర్టల్‌లో రైతులు వారి భూములకు సంబంధించి వివరాలు నమోదు చేయించుకోవాలన్నారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా ఆధునీకరణ(డిజిటలైజేషన్) చేయడానికి కేంద్ర ప్రభుత్వం రైతులకు 11 అంకెల ప్రత్యేక విశిష్టత సంఖ్య అందిస్తుందన్నారు. ఇది ఆధార్ తరహాలో నంబర్ ఉంటుందన్నారు. సొంత భూమి కలిగిన రైతులు, ఇంట్లో ఎంతమంది పేరున పొలం ఉంటే అంతమంది రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వివిధ సంక్షేమ పథకాలు, రాయితీలు పొందాలంటే రైతులు తప్పనిసరిగా ఈ విశిష్ట సంఖ్య నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

ప్రేమ ఎంత మధురం

- రెండు అక్షరాలు.. నూరేళ్ల జీవితం
- పోరాడి గెలిచిన వారు కొందరు
- ప్రేమ కోసం జీవితాన్ని గెలిచిన వారు ఇంకొందరు
- నేడు ప్రేమికుల దినోత్సవం



బిక్కవోలు: ప్రేమ రెండక్షరాలు.. రెండు హృదయాలు.. ప్రేమ అనిర్వచనీయం.. చూపులు కలిసి, మనసులు ఒక్కటై జీవిత భాగస్వాములుగా కలకాలంగా జీవించేందుకు పునాది వేస్తుంది. ఆ జీవన ప్రయాణంలో ఏళ్లు గడిచినా.. కొత్తగానే అనిపిస్తుంది. ఆ మధురస్మృతులను కలకాలం గుర్తుండేలా చేస్తుంది. క్లాసు రూముల్లో మొదలైన ప్రేమను కొందరు కలకాలం నిలుపుకొని ఆనందంగా గడుపుతున్నారు. ప్రేమ ఎంత మధురమో.. జీవితంలో స్థిరపడడం అంతే ముఖ్యమంటూ సూచిస్తున్నారు. ప్రస్తుతం యువత ఆకర్షణను ప్రేమ అనుకుంటూ.. జీవితమంతా దారి తప్పుతున్నారని పలువురు హెచ్చరిస్తుండగా, స్వచ్ఛమైన ప్రేమ కలకాలం నిలుస్తుందని మరి కొందరు చెబుతున్నారు. మనసులు, మనోభావాలు కలిసిన జంట ఎన్ని కష్టాలనైనా ఎదిరించి తమ ప్రేమను గెలిపించుకోవడం కోసం దృఢసంకల్పంతో నిలబడుతుంది. పరువు, ప్రతిష్ట పేరుతో పిల్లల ప్రేమను తిరస్కరించిన పెద్దలను సైతం ఒప్పించగలిగే నమ్మకాన్నిస్తుంది. ప్రాంతం వేరైనా.. కులం, మతం అడ్డుపడినా తెగించి నిలబడిన ప్రేమజంటలే ఆనందమయ జీవనం సాగిస్తున్నాయి. అలాంటి వారి మనసులోని మాటలే ఈ కథనం.

మనసుపడి.. ఏకమయ్యాం



పాఠశాల స్థాయిలో ఒకరికి తెలియకుండా మరొకరం ప్రేమలో పడ్డాం. మాటలు కలిసి పరిచయం ప్రేమగా మారింది. ఒక ఉన్నత స్థాయిలో వచ్చిన తరువాత పెద్దలకు చెప్పి, వారి అంగీకారంతో ప్రేమను నిలబెట్టుకోవడానికి పెళ్లి చేసుకున్నాం. పెళ్లి జరిగి 12 ఏళ్లు పూర్తయ్యాయి. మా ప్రేమకు గుర్తుగా ఇద్దరు అబ్బాయిలున్నారు. నిజమైన ప్రేమ ఎప్పుడూ ఆనందంగా ఉంటుంది.

– కుక్కల అశోక్‌కుమార్, కల్యాణి దంపతులు, పందలపాక

పెద్దలు ఆమోదిస్తేనే..



ప్రేమ పెళ్లిళ్లకు పెద్దల ఆమోదం పొందితేనే బాగుంటుంది. ఇల్లు విడిచిపోవడం, కష్టపడి ఇంటికి చేరడం బాగుండదు. ఏది ఏమైనా నచ్చిన అమ్మాయిని, అబ్బాయిని పెళ్లి చేసుకోవడం ఆనందమే అయినా, వారి మధ్య అప్యాయంగా జీవించాలన్నదే మా లక్ష్యం. అందుకే మా ప్రేమ కోసం 9 ఏళ్లు నిరీక్షించాం. పెద్దల సమక్షంలో మా వివాహం జరిగింది. ఇప్పుడు మేము ఎంతో సంతోషంగా ఉంటున్నాం.

– గొర్రిపోటి దుర్గా సునీల్‌కుమార్, దుర్గాదేవి దంపతులు, పందలపాక

మిర్తిపాడులో ఇంటింటి సర్వే


మిర్తిపాడులో ఇంటింటి సర్వే చేస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

సీతానగరం: బర్డ్ ఫ్లూ వ్యాపించడంతో మండలంలోని మిర్తిపాడులో వైద్యారోగ్య శాఖ సిబ్బంది గురువారం ఇంటింటి సర్వే చేపట్టారు. అనుమానిత లక్షణాలు ఉన్నాయా అని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఐదు రోజుల క్రితం కోళ్ల ఫారంలో సుమారు 8 వేల కోళ్లు చనిపోవడంతో, శాంపిళ్లను ల్యాబ్‌కు పంపించగా బర్డ్ ఫ్లూ అని నిర్ధారణ అయింది. దీంతో వైద్యారోగ్య సిబ్బంది రెండు బృందాలుగా ఇంటింటికీ వెళ్లి, ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్నారు. జలుబు, దగ్గు, ఆకస్మికంగా జ్వరం రావడం, ఒంటి నొప్పులు బర్డ్ ఫ్లూ లక్షణాలని ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పిస్తున్నారు. ఎటువంటి అనుమానిత కేసులు నమోదు కాలేదని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ ఏవీకే చైతన్య తెలిపారు. ఏపీహెచ్ఈఓ వైఎస్ రాయుడు, ఎంఎల్‌హెచ్‌పీ వి.శైలజ, హెల్త్ అసిస్టెంట్ గంగాధర్, ఏఎన్ఎం డి.కుమారి, ఆశా వర్కరు టి.నిర్మల తదితరులు సర్వే నిర్వహిస్తున్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ


రాజానగరంలో శిక్షణ పొందుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

రాజానగరం: ఐసీడీఎస్ స్థానిక ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలకు మూడు రోజుల పాటు ఇచ్చే శిక్షణ తరగతులు మండలంలో రాజానగరం, పాత తుంగపాడు ఉన్నత పాఠశాలలో గురువారం ప్రారంభమయ్యాయి. రాజానగరంలో సూపర్‌వైజర్ దుర్గామణి, పాత తుంగపాడులో ఎస్.భూదేవి ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ శిక్షణకు 98 మంది కార్యకర్తలు హాజరయ్యారు. కేంద్ర ఆదేశాల మేరకు పోషణ్ భీ, పఢాయి భీ కార్యక్రమం అమలులో భాగంగా ఈ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. ఆరేళ్లలోపు పిల్లల ఎదుగుదల, శారీరక చలన, కండరాల అభివృద్ధితో పాటు, మాట్లాడే విధానం(భాషాభివృద్ధి), వస్తువులను లెక్కించడం (గణితాభివృద్ధి), సాంఘిక, భావోద్వేగ అభివృద్ధి, సృజనాత్మకత తదితర వాటిపై కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్నారు.

జ్ఞానోదయ రామ భవనానికి విరాళం

సీతానగరం: గ్రామంలో పునర్నిర్మిస్తున్న జ్ఞానోదయ రామ భవనానికి గోకవరానికి చెందిన విశ్వ హిందూ ధర్మ పరిరక్షణ అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు రూ.లక్ష విరాళం అందించారు. భవన పునర్నిర్మాణ పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు ఆయనను సన్మానించారు.

పింఛన్లు ఆపితే.. అధికారుల నుంచి వసూలు చేస్తాం

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి హెచ్చరిక


సూపరింటెండెంట్‌కు మాజీ ఎమ్మెల్యేతో పాటు వినతిపత్రం ఇస్తున్న వికలాంగుడు నాగ గిరీష్, కుటుంబ సభ్యులు

పెదపూడి: అధికారులు మానవత్వంతో పనిచేయాలని, రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి అధికార పార్టీకి తొత్తులుగా పనిచేయరాదని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. అనపర్తి గ్రామం శివారు సావారంలో బీసీ సామాజిక వర్గానికి చెందిన కాదా నాగ గిరీష్ వికలాంగ పెన్షన్.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిలిచిపోయింది. ఆ సొమ్ము వెంటనే అందజేయాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యేతో పాటు, నాగ గిరీష్, అతడి కుటుంబ సభ్యులు అనపర్తి ఎంపీడీఓ కార్యాలయంలో సూపరింటెండెంట్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ, సుమారు 15 ఏళ్లుగా నాగ గిరీష్ వికలాంగ పెన్షన్ పొందుతున్నాడన్నారు. అతడి వికలాంగ సర్టిఫికెట్ గతేడాది ఫైనల్ రీ వెరిఫికేషన్ అయిందని, 90 శాతం వికలాంగత్వం ఉన్నట్లు డాక్టర్లు ధ్రువీకరించారన్నారు. కొత్తగా వచ్చిన కూటమి ప్రభుత్వ నిబంధనల ప్రకారం నెలకు రూ.15 వేల పెన్షన్‌కు నాగ గిరీష్ అర్హుడయ్యారన్నారు. ఇటీవల అతని పెన్షన్‌ను నిలిపివేయడంతో కుటుంబ సమేతంగా పలుసార్లు స్థానిక ఎంపీడీఓను కలిశారని, అయితే నాగగిరీష్ వికలాంగత్వంపై కొంతమంది అధికార పార్టీ నాయకులు ఫిర్యాదు చేయడంతో, రీ వెరిఫికేషన్ కోసం పెన్షన్ నిలుపుదల చేసినట్టు చెప్పారన్నారు. దీనిపై కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో నాగ గిరీష్ వినతిపత్రం అందించారన్నారు. ఏ అధికారి ఇంటిని సందర్శించకుండానే లబ్ధిదారుడు సంతకం పెట్టడానికి నిరాకరించాడని వారే సొంతంగా రాసుకుని ఆర్డీలు కూడా క్లోజ్ చేసే పరిస్థితిలో వ్యవహరిస్తున్నారంటూ ఆరోపించారు. పక్షపాతంతో అధికారులు పనిచేయడం సరికాదన్నారు. నియోజకవర్గంలో అధికార పార్టీ నాయకులు కొత్త సంప్రదాయానికి నాంది పలికారని, అదే పంథాను తాము కూడా అనుసరిస్తామని స్పష్టం చేశారు. ఏ అధికారులైతే అనర్హుల పెన్షన్లు నిలిపివేస్తున్నారో, లబ్ధిదారునికి జరిగిన నష్టాన్ని వడ్డీతో సహా వారి నుంచే వసులూ చేస్తామన్నారు. నాగగిరీష్‌కి న్యాయం జరగకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, వైస్ ఎంపీపీ కర్రి దాసు, అనపర్తి ఏఎంసీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, పార్టీ అనపర్తి కన్వీనర్ నల్లమిల్లి మురళీమోహన్ బాలకృష్ణారెడ్డి, ఎంపీటీసీలు ఏడుకొండలు, కొండేటి భీమేశ్వర స్వామి, నాయకులు శ్రీనివాస్, జారపు వెంకట అచ్చయ్య, జె.వెంకటేష్, కె.దుర్గారావు, జీ.వీరరాఘవులు, కాదా లోవరాజు, డి.రాధాకృష్ణ, ఏసు, గిరీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

– శహపురంలో ఏపీఆర్‌సీఎస్ నిరసన


శహపురంలో నిరసన తెలుపుతున్న నాయకులు

పెదపూడి: కర్నూలు జిల్లా బి.తాండ్రపాడు గ్రామంలో ప్రభుత్వ భూములలో గుడిసెలు నిర్మించుకుని జీవిస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేద ప్రజలపై భూ కబ్జాదారులు చేసిన దాడి సంఘటనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం(ఏపీఆర్‌సీఎస్) ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శహపురం గ్రామంలో ఈ ఘటనపై గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రాజబాబు మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేదలు జీవిస్తున్న గుడిసెలను తగులబెట్టిన భూ కబ్జాదారుల నిరంకుశత్వాన్ని ఖండిస్తున్నామన్నారు. నిరాశ్రయులైన పేదలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలన్నారు. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని, నిందితులను కఠినంగా శిక్షించి, బాధితులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో పలువురు సంఘ నాయకులు పాల్గొన్నారు.

నవజాత శిశువుల రక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలి


వెదుళ్లపల్లిలో అంగన్‌వాడీ వర్కర్లకు శిక్షణ ఇస్తున్న ఇందిరా భారతి

సీతానగరం: అంగన్‌వాడీ వర్కర్లందరూ నవజాత శిశువుల రక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఇందిరా భారతి అన్నారు. వెదుళ్లపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గురువారం బొబ్బిల్లంక సెక్టార్‌లోని 20 అంగన్‌వాడీ కేంద్రాల వర్కర్లకు పోషణ్ భీ–పఢాయి భీ కార్యక్రమంలో భాగంగా మూడు రోజుల శిక్షణను ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే సేవలు, ప్రీ స్కూల్‌లో పిల్లలకు ఇచ్చే అనుబంధ ఆహారం తదితర వాటిని వివరించారు. పిల్లలకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేసేలా చూడాలన్నారు. బాల్య వివాహాలను అడ్డుకుని, వారి కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు అక్షరాలు నేర్పి, బడికి వెళ్లే విధంగా తీర్చిదిద్దాలన్నారు. పిల్లల ఎత్తు, బరువు తరచూ పరీక్షించాలన్నారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

ఘనంగా పాశాలమ్మ విగ్రహ పునః ప్రతిష్ఠ


బూరుగుపూడిలో ప్రతిష్ఠించిన పాశాలమ్మ విగ్రహం

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడిలో గురువారం పాశాలమ్మవారి నూతన విగ్రహ పునః ప్రతిష్ఠ ఘనంగా జరిగింది. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ శిఖర, యంత్ర ప్రతిష్ఠ జరిగింది. మూడు రోజుల పాటు నిర్వహించిన ఉత్సవాలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా పండితులు హోమాలు నిర్వహించారు. అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు, కుంకుమార్చన నిర్వహించారు. భారీ అన్న సమారాధన జరిగింది.

రేపు కన్యకాపరమేశ్వరి విగ్రహ ప్రతిష్ఠ

- గణపతి పూజతో అంకురార్పణ
- కలశాలతో గ్రామోత్సవం


కలశాలతో గ్రామోత్సవం నిర్వహిస్తున్న ఆర్య వైశ్యులు

రాజానగరం: ఆర్య వైశ్యుల ఆరాధ్య దైవం వాసవీ కన్యకాపరమేశ్వరి స్థానిక రావుల చెరువు గట్టున నూతనంగా నిర్మించిన ఆలయంలో శనివారం విగ్రహ ప్రతిష్ఠ జరగనుంది. ఇందుకు సంబంధించిన పూజా కార్యక్రమాలు గురువారం గణపతి పూజతో ప్రారంభమయ్యాయి. యాగశాల ప్రవేశం చేసి, పుణ్యహవాచనం, పంచగవ్య ప్రాసన, రక్షధారణ, దీక్షధారణ, మండపారాధన, అగ్ని ప్రతిష్ఠాపన, దేవత హోమం చేశారు. ఈ సందర్భంగా ప్రతిష్ఠించే విగ్రహాలతో పాటు, కలశాలతో గ్రామోత్సవాన్ని నిర్వహించారు. శుక్రవారం చండీ హోమం చేసి, ప్రతిష్ఠించే విగ్రహాలకు క్షీరాభిషేకం, జలాదివాసం, వస్త్రాదివాసం, ధాన్యదివాసం, ఫలాదివాసం, పుష్పాదివాసం, దేవతాహోమాలు జరుగుతాయి. శనివారం ఉదయం 11.30కు మహా గణపతి సహిత వాసవీ కన్యకాపరమేశ్వరి ధ్వజస్తంభ ప్రతిష్ఠ జరగనుంది.

చక్రద్వారబంధంలో...

మండలంలోని చక్రద్వారబంధంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శనివారం ఉదయం 10.54కు శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ జరగనుంది. అలాగే జయ, విజయ, గరుడ అళ్వార్, విష్వక్సేనుడు, వరాహ స్వామి విగ్రహాలను, శిఖర, యంత్రరాజ సహిత ధ్వజ స్తంభ ప్రతిష్ఠోత్సవాలను నిర్వహించే కార్యక్రమాన్ని గణపతి పూజతో గురువారం శ్రీకారం చుట్టారు.

ప్రజాభిప్రాయ సేకరణతోనే ఇసుక ర్యాంపు

– జేసీ చిన్నరాముడు


మునికూడలిలో ప్రజాభిప్రాయ సేకరణలో మాట్లాడుతున్న జేసీ

సీతానగరం: గ్రామ ప్రజల అభిప్రాయంతోనే నూతన ఇసుక ర్యాంపు ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని జిల్లా జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు తెలిపారు. గురువారం మునికూడలి పంచాయతీ కార్యాలయంలో నూతన ఇసుక ర్యాంపు ఏర్పాటుపై పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ చిన్నరాముడు మాట్లాడుతూ, మునికూడలి ఓపెన్ రీచ్‌లో గోదావరి పరివాహక ప్రాంతంలో 28.50 హెక్టార్ల ప్రభుత్వ భూమిలో ఇసుక తవ్వకాలు జరుపుతామన్నారు. దీనిపై గ్రామ ప్రజల ఏకాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. ప్రజాభిప్రాయ సేకరణలో పలువురు మాట్లాడుతూ, ఇసుక ర్యాంపు ఏర్పాటు వలన కూలీలకు ఉపాధితో పాటు, గ్రామాభివృద్ధి జరుగుతుందన్నారు. ఇసుక ర్యాంపు ఏర్పాటుతో వాహనాలు ఇష్టారాజ్యంగా వెళ్లడంతో పలు ప్రమాదాలు జరుగుతాయని, గ్రామాల వద్ద వాహనాలు వేగంగా వెళ్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గోదావరి వరద సమయంలో ఏటిగట్టు కోతకు గురవుతుందని, రక్షణ గోడ కట్టాలని కోరారు. తరచూ వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, ఆలయాల నిర్మాణానికి నిధులు అందించాలని కోరారు. దుమ్ము, ధూళి ఎగరకుండా రోడ్డును నీటితో తడపాలని పలువురు కోరారు. ఈ కార్యక్రమంలో మైన్స్ ఏడీ ఫణిభూషణ్, పర్యావరణాధికారి, తహసీల్దార్ ఎ.శ్రీనివాస్, పంచాయతీ, రెవెన్యూ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి


వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న డాక్టర్ జయానందకుమార్

రాజానగరం: ఉద్యోగాలను పొందేలా కాకుండా, స్వయంగా పరిశ్రమలను స్థాపించి, పది మందికి ఉపాధి కల్పించే దిశగా ఆలోచనలు ఉండాలని గైట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.జయానందకుమార్ విద్యార్థులకు సూచించారు. కళాశాలలో వర్ధమాన వ్యాపార నిర్వాహకులకు మార్కెటింగ్ ప్రణాళికలు అనే అంశంపై గురువారం వర్క్‌షాప్ జరిగింది. మేనేజ్‌మెంట్ స్టడీస్, ఇన్నోవేషన్ కౌన్సిల్ సంయుక్త ఆధ్వర్యంలో ఎంబీఏ హెచ్‌ఓడీ డాక్టర్ బీవీఆర్ నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, వ్యాపారాలను పెంచుకునేందుకు అనుసరించవలసిన మార్కెటింగ్ మెళకువలను వివరించారు. మార్కెటింగ్ ప్రణాళికలపై డిజిటల్ మార్కెటింగ్‌లో విశేష అనుభవం కలిగిన పి.నరేంద్రకుమార్ అవగాహన కలిగించారు. కార్యక్రమంలో గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ) డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ పీఎంఎంఎస్ శర్మ, డీన్ డాక్టర్ ఎన్.లీలావతి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీఎస్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌వీఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక శక్తులకు సహకరించవద్దు

– నార్త్ జోన్ డీఎస్పీ శ్రీకాంత్


నాయకులు, సభ్యులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ శ్రీకాంత్

మధురపూడి: ఆటో డ్రైవర్లు నిబంధనలను అనుసరించాలని, అసాంఘిక శక్తులకు సహకరించరాదని రాజమహేంద్రవరం అర్బన్ జిల్లా నార్త్ జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్ అన్నారు. గురువారం కోరుకొండ బస్టాండ్ సెంటర్‌లో ఆటో యూనియన్ సభ్యులకు ఆయన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆటో డ్రైవర్లు ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, యూనిఫామ్‌ను తప్పనిసరిగా ధరించాలని స్పష్టం చేశారు. మద్యం సేవించి వాహనాలను నడపడం నేరమన్నారు. అలాగే పరిమితికి మించి ప్రయాణికులను ఆటోల్లో ఎక్కించుకోవడం ప్రమాదాలకు దారితీస్తుందన్నారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలను సరఫరా చేస్తున్న వారికి సహకరించరాదన్నారు. అలాంటి వారు తారసపడితే సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలకు అనుగుణంగా ఆటోలను నడపాలన్నారు. ఈ కార్యక్రమంలో కోరుకొండ ఎస్సై శ్యామ్ సుందర్, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

పాత వీరంపాలెంలో డయేరియా కలకలం


పాత వీరంపాలెంలో రోగులను పరీక్షిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ


గ్రామంలో ఇంటింటి సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

- ఆరుగురి గుర్తింపు
- గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు
- పర్యటించిన జిల్లా అధికారులు

రంగంపేట: మండలంలోని పాత వీరంపాలెం గ్రామంలో డయేరియా కలకలం రేపింది. గురువారం తెల్లవారుజాము నుంచి గ్రామంలో కొంత మందికి వాంతులు, విరేచనాలు కావడంతో గ్రామస్తులు వైద్య సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో రంగంపేట, సింగంపల్లి పీహెచ్‌సీల వైద్యాధికారులు బి.వేణుశ్రీలక్ష్మి, కె.చిన్నారావు, కె.సంకీర్తన వైద్య సిబ్బందితో గ్రామానికి చేరుకుని ఇంటింటి సర్వే చేపట్టారు. మొత్తం ఆరుగురికి అతిసారా లక్షణాలున్నట్టు గుర్తించి, వైద్య సేవలందించారు. గ్రామంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి, పరిస్థితిని సమీక్షిస్తున్నారు. పాత వీరంపాలెం గ్రామాన్ని రాజమహేంద్రవరం డిప్యూటీ డీఎంహెచ్ఓ సుధాకర్ సందర్శించారు. అతిసారా లక్షణాలున్న రోగులను పరీక్షించారు. జిల్లా సర్వేలెన్స్ నుంచి జాన్సన్, సురేష్, శ్రీనివాస్, నాగు తదితరులతో వైద్య బృందాన్ని రప్పించి, గ్రామంలో ప్రతి ఇంటినీ, కేసులను పరిశీలించారు. నీటి నమూనాలను సేకరించి పరీక్షల కోసం రాజమహేంద్రవరం తీసుకువెళ్లారు. విరేచనాలు ఎక్కువగా ఉన్న ఎం.మంగతాయారు, వై.దుర్గారావు, పి.నాగమణిని డిప్యూటీ డీఎంహెచ్ఓ పరీక్షించి, ప్రస్తుతం వారి పరిస్థితి నిలకడగానే ఉందని తెలిపారు. వాంతులు, విరేచనాలకు ఫుడ్ పాయిజనింగ్ కారణంగా నిర్ధారించినట్టు చెప్పారు.

డీపీఓ సందర్శన

అతిసారా కలకలం కారణంగా పాత వీరంపాలెం గ్రామాన్ని జిల్లా పంచాయతీ అధికారి శాంతామణి సందర్శించారు. గ్రామంలోని అనుమానిత ఇంటిని సందర్శించి, పరిస్థితిని సమీక్షించారు. ఎంపీడీఓ వీరసాయిబాబు, విస్తరణాధికారి వెంకటరత్నం ఆధ్వర్యంలో గ్రామంలోని మంచినీటి ట్యాంకులను, పైప్‌లైన్లను పరిశీలించి, శానిటేషన్ పనులు చేపట్టాలని ఆదేశాలిచ్చారు. రంగంపేట వైద్యాధికారి వేణుశ్రీలక్ష్మి మాట్లాడుతూ, ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉందని, కొత్త కేసులు నమోదు కాలేదన్నారు. మందులన్నీ అందుబాటులో ఉన్నాయన్నారు. గ్రామంలో కొద్ది రోజులు వైద్య శిబిరం కొనసాగించనున్నట్టు తెలిపారు. కాగా గురువారం రాత్రి పాత వీరంపాలెం గ్రామాన్ని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సందర్శించారు.